# మారిన క్రాపు

— జీవన్

నేడు హిప్పీ క్రాపు ఫాషనయింది గదండీ. నేను పరీక్షలకు నెలం మీద తిరుపతి పోవాలనే వంక పెట్టి మొత్తానికి ఎట్టయితేనేం అష్టకష్టాలుపడి చెవులు వినబడకుండా కండ్లు కనపడకుండా క్రాపు పెంచసాగాను. నా ఖర్మకాలి ఆ పరీక్షలు ఓ పది రోజుల్లోనే అయిపోయినాయి. ఇహ ఆ తరువాతనే మొదలయింది అసలు కథ.

పరీక్షలు పూర్తి కాగానే తిరుపతి వెళ్ళమని మా నాన్న తన పోరు ప్రారంభించాడు. కాని రిజల్ట్సు వచ్చిందాకా వెళ్ళాలని నాకు లేదు. తిరుపతికి వెళ్ళకపోయినా క్షౌరశాలకన్నా వెళ్ళమని మా నాన్నగారు హుకుం జారీ చేయటంతో తండ్రి మాట జవదాటని శ్రీరామునిలా నా డైరీతో సహా క్షౌరశాలకు పయనమయ్యాను. అరుంధతి వశిష్ఠులలా నా డైరీ, నేను ఎట్టి పరిస్థితులలోను విడిపోము. దాంట్లో రెండు మూడు కారులూ, కవర్లూ, రకరకాల విషయాలు వుంటాయనుకోండి. అది వేరే విషయం. కొత్తగా వింతన్నిట్లు, కొత్త అధునాతనంగా, నూతనంగా స్థాపించబడిన ఒక షాపులోకి ప్రవేశించాను. "రాజేష్ఖన్నా క్రాపు చేయమని ఆర్డరిచ్చాను. వెంటనే కొద్దిగా తగ్గించాడు. అప్పుడు నా క్రాపుకు రాజేష్ఖన్నా క్రాపుకు నక్కకూ నాగలోకానికీ ఉన్నంత తేడా కనిపించినది. ఈ క్రాపేం బాగాలేదూ, ఇంకొంచెం తగ్గించమన్నా. అతడు ఇంకొంచెం కత్తిరించి ఏదో కొత్త వ్యూహం పన్నుతున్న సేనానిలా ఒక్క క్షణం ఆగి హటాత్తుగా దాడి చేసిన శత్రువులా ఇంకొంచెం తగ్గించేశాడు. "అదేంటయ్యా! మరి కాస్త కట్ జేశావు ఇందాకనే బాగుందే" అన్నాను నేను.

"అప్పు లేదండి. ఆ క్రాప రాజేష్ఖన్నా క్రాపులా లేదండి" అన్నాడతడు మెల్లగా. మరికాస్త కత్తిరించి "బాగుందా!" అన్నాడు.

"అబ్బె ఛా! అసలు బాగాలేదు. పోనీ కనీసం పద్మనాభం క్రాప్ అన్నా చేయి" అన్నాను గద్గద స్వరంతో. "ఏ ప్రముఖ హీరో క్రాపుకూ నా క్రాపు పోలటం లేదనే నా విచారం. అతడు సరేనని కత్తెరతో చాలా జుత్తు కత్తిరించాడు. అంత జుత్తు కత్తిరించవలసిన అవసరము లేదని తలను కాస్తా ఊపా. అది కొత్త కత్తెరేమో ఆ కాస్తా తెగూరుకుంది. నా కేడుపు ముంచుకొచ్చిందనుకోండి. ముఖం ముందు జుట్టు తెగిపోతే ఏడుపు రాకేం చేస్తుంది చెప్పండి? చివరకు ఆస్ట్రాల్ ఒక హాస్యనటుడి జుట్టులా అన్నా లేదు నా క్రాపు. ఇహ నేను సమ్మర్ క్రాపు చేయించుకోవాలి లేదా తిరుపతి క్రాపే శరణ్యం. వెంటనే గుండు చేయమని అతనికి ఆర్డరిచ్చి జరిగిన కథంతా గుర్తు చేసుకుంటూ, కన్నీళ్ళు బయటకు రాకుండా ఆపుకుంటుంటే ఓ మంచి ఆలోచన తళుక్కుమంది. వెంటనే డైరీ నుండి ఒక కాగితం తీసి "నే తిరుమలకు వెళుతున్నా, అని" ఇంటికి లెటర్ వ్రాసి వెంటనే ఎవరూ చూడకుండా రోడ్డుకెళ్ళి చీకటి పడగానే మా ఫ్రెండ్ ఉన్న ప్రక్క ఊరు కెళ్ళాను. వాడితో అప్పుడే తిరుపతి నుండి వస్తున్నానని అబద్ధమాడి నెల్లాళ్ళాగి మా ఊరికొచ్చాను.

ఏమయితేనేం నా హిప్పీ క్రాపు తిరుమల క్రాపుగా మారింది. అదయ్యా నా క్రాపు కథ.